కదంతొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

- 'వెన్నుపోటు దినం'కు వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు
- 'చంద్రబాబు డౌన్ డౌన్' అంటూ నినాదాలు



పామర్రులో మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీ

పామర్రు: పామర్రులో మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు కదం తొక్కారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గం లోని ఐదు మండలాల నుంచి వేలాదిగా ప్రజలు, పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొనడంతో పామర్రు జనసంద్రంలా మారింది. పార్టీశ్రేణులే కాకుండా స్థానిక ప్రజలు సైతం ఈ నిరసన ర్యాలీ కార్యక్రమంలో పాల్గొని వారి మద్దతు తెలిపారు. తొలుత స్థానిక పార్టీ కార్యాలయంలో దివంగత నేత వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి స్థానిక నాలుగురోడ్ల కూడలికి చేరుకున్నారు. కూడలి వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. 'చంద్రబాబు హామీలకు నీతిలేదు.. వెన్ను పోటు వీరుడు.. చంద్రబాబు డౌన్.. డౌన్' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే పామర్రు నియోజకవర్గ ప్రజలకు వెన్నుపోటు పొడుస్తున్నారన్నారు. మండలానికో షాడో ఎమ్మెల్యేను పెట్టి అక్రమ వసూళ్లకు పాల్పడుతూ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే చేసిన అక్రమాలపై త్వరలోనే కోర్టులో ప్రజావ్యాజ్యం వేసి అక్రమంగా వసూలు చేసిన ప్రతి రూపాయినీ తిరిగి చెల్లించేలా పార్టీ తరఫున చర్యలు తీసుకుంటామన్నారు.

అడుగు అడుగునా పోలీసుల ఆంక్షలు

ర్యాలీ ప్రారంభం నుంచి తుది వరకు పోలీసులు అడుగడుగునా ఆంక్షలను విధించారు. మైక్‌కు అనుమతులు లేవంటూ, బైక్, కార్లు వినియోగించవద్దు అంటూ పలు ఆంక్షలను జారీ చేశారు. వీటిని అధిగమిస్తూ కార్యాలయం వద్ద నుంచి శాంతియుతంగా ర్యాలీని నిర్వహించారు.

అధికంగా పాల్గొన్న మహిళలు

వెన్ను పోటు దినం నిరసన ర్యాలీ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ జీ రవికాంత్‌కు వినతిపత్రాన్ని అందించారు.



వెన్నుపోటు నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్

అరాచకాలకు అడ్డాగా కూటమి ప్రభుత్వం



కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చిన తరువాత అరాచకాలకు, మోసాలకు, అన్యాయాలకు అడ్డాగా మారింది. ఇందుకు నిరసనగా వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో పామర్రులో నిర్వహించారు. అధికారం చేపట్టి ఏడాదిలోని కూటమి నేతలు కోట్లాది ప్రజాధనాన్ని జోబులో నింపుకున్నారు.

– దాసరి అశోక్‌కుమార్, పామర్రు ఎంపీపీ

పేదలకు అన్యాయం చేస్తే పుట్టగతులుండవు



పేదలకు అన్యాయం చేస్తే వారికి పుట్టగతులు ఉండవు. అబద్ధపు వాగ్దానాలతో ఎన్నికల్లో గెలిచిన కూటమి నేతలు హామీలను నెరవేర్చటంలో విఫలం అయ్యారు. పేదలకు అందాల్సిన ప్రభుత్వ ధనాన్ని కూటమి నేతలు కాజేస్తున్నారు. పేదల ఉసురు తగులుతుంది .

– ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, పామర్రు

మాఫియాల నిలయం కూటమి ప్రభుత్వం



కూటమి ప్రభుత్వం మట్టి, ఇసుక మాఫియాలకు నిలయంగా మారింది. ఏ గ్రామం చూసినా మట్టి మాఫియా జరుగుతోంది. నియోజకవర్గంలో మట్టి, ఇసుక మాఫియాలు జరుగుతున్నా ఎమ్మెల్యే మాట్లాడక పోవడం అన్యాయం. ఇప్పటికైనా మట్టి ఇసుక మాఫియాలపై చర్యలు తీసుకోవాలి.

– కె.నాగమల్లేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు, కొమరవోలు

ఇబ్బందులు పడుతున్న ప్రజలు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు ఇలా సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇచ్చిన హామీలు, సూపర్ సిక్స్ అంటూ అధికారంలోకి వచ్చి ప్రజలకు వెన్ను పోటు పొడిచిన వ్యక్తిగా చంద్రబాబు చరిత్రలో నిలిచిపోతాడు.

– పుట్టి రామకృష్ణ, నిడుమోలు

ఏడాదిగా చేసింది ఏమీలేదు



ఏడాదిగా కూటమి ప్రభుత్వం చేసింది ఏమీలేదు.. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని వదిలేసింది. చంద్రబాబు తన పుత్ర రత్నం రాసుకున్న రెడ్ బుక్ పాలనను అమలు చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారు. దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

– పల్లికొండ రత్నకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు, ఎలకుర్రు

వెన్నుపోటు పొడవటంలో సిద్ధహస్తుడు



వెన్నుపోటు పొడవటంతో చంద్రబాబు సిద్ధహస్తుడు. నాడు సొంత మామ ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి పార్టీ పగ్గాలు అందుకున్నాడు. నేడు అమలుకు సాధ్యం కాని హామీలతో, సూపర్ సిక్స్ అంటూ రాష్ట్ర ప్రజలను మరో మారు వెన్నుపోటు పొడిచాడు.

– ఆరేపల్లి శ్రీహరి, వార్డు మెంబరు, పామర్రు



కైకలూరులో వెన్నుపోటు నిరసనలో ప్రభుత్వ మోసాల ఫ్లకార్డులు ప్రదర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అన్ని వర్గాల ప్రజలకు వెన్నుపోటు

గుడివాడ టౌన్: అధికారం కోసం సొంత మామనే వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వంతో కలిసి రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను వెన్నుపోటు పొడిచాడని వెన్నుపోటు దినం జిల్లా సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పాటిమీద గల విడిదిల్లు ఫంక్షన్ హాల్లో నియోజకవర్గ కార్యకర్తల సమావేశం జరిగింది. వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. చంద్రబాబు నాయుడు 2024 ఎన్నికల్లో ఉచిత హామీలు సూపర్‌సిక్స్ పేరుతో ప్రజలను ప్రత్యేకించి రైతులు, యువత, మహిళలు, కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులకు వెన్నుపోటు పొడిచారన్నారు. కూటమి ప్రభుత్వానికి ఓటు వేసినవారు సైతం మళ్లీ ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ పోలీస్ వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకుని రాక్షస పాలన నిర్వహిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీకి ప్రజలు పట్టం కట్టడం ఖాయమని జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవడం తథ్యమన్నారు.

ర్యాలీ నిరసన

గుడవాడలో బుధవారం వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక జగన్నాథపురంలోని నిమ్మగడ్డ విడిదిల్లు నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్లారు. వన్ టౌన్, టూటౌన్ సీఐలు, వారిని అడ్డుకుని ర్యాలీని నిలిపివేశారు. కేవలం 10 మందిని మాత్రమే అనుమతిస్తామని మిగిలిన వారిని నిలిపివేశారు. అనంతరం నాయకులు ఆర్డీఓ కార్యాలయం చేరుకుని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయలేదని, ప్రజలను మోసం చేసిందని ఎన్నికల హామీలు అమలయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి, నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, పాలేటి చంటి, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, జిల్లా నాయకులు మట్టా జాన్ విక్టర్, ఎంపీపీ పెయ్యల ఆదాం, దేశిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, మహ్మద్ కాసీం, రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల పార్టీ అధ్యక్ష,కార్యదర్శులు, మైనార్టీ సెల్, ఎస్సీ సెల్, ఉద్యోగ సంఘాల నాయకులు, మహిళా నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



గుడివాడలో ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



గుడివాడలో ఆర్డీఓ కార్యాలయానికి ర్యాలీగా వెళుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

రైతులను నిలువునా ముంచారు



కూటమి పాలనలో రైతులు పూర్తిగా నష్టపోయారు. పెట్టుబడి సాయం గత ప్రభుత్వం రూ. 13,500 ఇస్తే కూటమి అధికారంలోకి వస్తే రూ. 20 వేలు ఇస్తామన్నారు. ఇప్పటి వరకు ఇవ్వలేదు. ఇక గిట్టుబాటు ధర విషయంలో కూటమి ప్రభుత్వం రైతులను నిలువునా ముంచింది.

– అప్పినేడి నాంచారయ్య, గాదేపూడి, గుడ్లవల్లేరు మండలం

ప్రతి కార్మికునికి వెన్నుపోటు తగిలింది



కూటమి ప్రభుత్వంలో ప్రతి కార్మికుడు వెన్నుపోటుకు గురయ్యారు. ఉచిత ఇసుక అన్నారు. రేటు భరించలేని స్థాయికి చేరడంతో తాపీ కార్మికులకు పనులు లేక వెన్నుపోటుకు గురవుతున్నారు. ఉద్యోగులకు సంబంధించి ఐదు డీఏలు బకాయి ఉన్నాయి. ని రుద్యోగ యువత కూడా వెన్నుపోటుకు గురయ్యారు.

– తులిమిల్లి యెషయ్య(వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి), జొన్నపాడు

కరెంట్ బిల్లులు కట్టలేకపోతున్నాం



జగన్ పాలనలో కరెంట్ బిల్లు రూ. 250 నుంచి రూ.300 లోపు వచ్చేది. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి రూ. 800 నుంచి రూ. 900 ఆపైబడి కరెంట్ బిల్లులు వస్తున్నాయి. సామాన్యులమైన మేము ఇంత కరెంట్ బిల్లు ఎలా చెల్లించాలి.

– కాటూరి వెంకటరమణ, గుడివాడ

తల్లికి వందనం ఎక్కడ?



జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి పేరుతో ప్రతి పేద విద్యార్థి తల్లికి రూ. 15 వేలు జమచేసేవారు. కుటుంబంలో ఎంతమంది విద్యార్థులుంటే తల్లికి వందనం పేరుతో కూటమి నాయకులు ఇస్తామన్నారు. గత ఏడాది ఇవ్వలేదు. ఈ ఏడాది ఎ ప్పుడు ఇస్తారో తెలియదు.

– ఎం.ఉమ, వైఎస్సార్ సీపీ నాయకురాలు, గుడివాడ

నిరుద్యోగులకు శఠగోపం



కైకలూరులో నిర్వహించిన వెన్నుపోటు దినం ర్యాలీలో వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

కైకలూరు: వెన్నుపోటుకు కేరాఫ్ అడ్రాస్‌గా సీఎం చంద్రబాబునాయుడు చరిత్రలో మిగిలిపోతారని, అదేవిధంగా నిరుద్యోగులకు ఆయన శఠగోపం పెట్టారని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) విమర్శించారు. కైకలూరులో బుధవారం నిర్వహించిన వెన్నుపోటు దినం విజయవంతమైంది. నియోజకవర్గం నాలుగు మండలాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరయ్యారు. ఏలూరు పార్లమెంటు ఇన్‌చార్జి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. రైల్వేస్టేషన్ వద్ద పార్టీ కార్యాలయం నుంచి నాయకులు ర్యాలీగా రెవెన్యూ కార్యాలయానికి వెళ్లారు. తహసీల్దారు ఎండీ ఇబ్రహీంకు ప్రభుత్వ మోసాలపై వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా తాలూకా సెంటర్‌లో డీఎన్నార్ మాట్లాడుతూ పోలీసు కేసులకు ఎవరూ భయపడొద్దని పేర్కొన్నారు. కైకలూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆదేశాలతో పోలీసులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారన్నారు. పోలీసులను మాకు సహకరించకపోతే వీఆర్‌కు పంపుతామని ప్రజా ప్రతినిధులు భయపెడుతున్నారన్నారు. ప్రజా ప్రతినిధుల ఆదేశాలతో పార్టీ కార్యకర్తలను వేధించే ధోరణిని మానుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ముదిరాజుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధనరావు, జిల్లా ఉపాధ్యక్షులు చేబోయిన వీరరాజు, రాష్ట్ర వాణిజ్య విభాగ సెక్రటరీ, ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ సెక్రటరీ, మండవల్లి ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, కలిదిండి ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, ముదినేపల్లి జెడ్పీటీసీ ఈడేపల్లి వెంకటేశ్వరమ్మ, రాష్ట్ర రైతు విభాగ సెక్రటరీ సయ్యపురాజు గుర్రాజు, రాష్ట్ర బీసీ సెల్ సెక్రటరీ బలే నాగరాజు, రాష్ట్ర మహిళా విభాగం సెక్రటరీలు గంటా సంధ్య, కుసనపూడి కనకదుర్గారాణి, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి గాదిరాజు వెంకట కిషోర్ మణికంఠ వర్మ, జిల్లా మేధావుల ఫోరం అధ్యక్షుడు దుగ్గిరాల వెంకటనాగేశ్వరరావు, జిల్లా ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్ల విభాగ అధ్యక్షుడు వేణుగోపాలరావు, జిల్లా అధికార ప్రతినిధి మోట్రూ అర్జునరావు, నాయకులు జయమంగళ కాసులు, మహాదేవ విజయబాబు, థామస్, బీవీ.రావు, గుమ్మడి వెంకటేశ్వరరావు, నంబూరి శ్రీదేవి, ముంగర నరసింహారావు, చిట్టూరి మురళీకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు రాము, ఏసోబురాజు, రమేష్, రామరాజు పాల్గొన్నారు.

అబద్ధపు హామీలతో మరోమారు వెన్నుపోటు

పామర్రు: గత ఏడాది ఇదే రోజున అబద్ధపు హామీలతో రాష్ట్ర ప్రజలను చంద్రబాబు నాయుడు మరోమారు వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం పామర్రులో వెన్నుపోటుదినం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీలలో చెప్పిన విధంగా రైతులకు ఇవ్వాల్సిన రైతు బంధు పథకం ద్వారా రెండేళ్లపాటు రూ.40వేలు, తల్లికి వందనం ద్వారా ప్రతి విద్యార్థికి రెండేళ్ల పాటు రూ.30 వేలు, 18 ఏళ్లు నిండిన ఆడ పిల్లకు రూ.18వేలు.. ఈ విధంగా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం బాకీ ఉందన్నారు. అంతే కాకుండా ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, 50ఏళ్లకే పింఛన్, ఉచిత గ్యాస్ సిలిండర్, విద్యా దీవెన, వసతి దీవెన, ఆరోగ్యశ్రీ, వాలంటీర్లకు రూ.10వేలు కూడా ఇవ్వలేదన్నారు. ఈ విధంగా అన్ని వర్గా ప్రజలను మోసం చేసి వెన్ను పోటు పొడించిదీ ప్రభుత్వం అన్నారు. కూటమి అధికారం చేపట్టిన తర్వాత వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలపై 2,477 అక్రమ కేసులు, 766 మందిపై హత్యాయత్నాలు, 390 హత్యలకు పాల్పడి రెడ్ బుక్ పాలన సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో ఐదు మండలాల నాయకులు తాడిశెట్టి శ్రీనివాసరావు, దాసరి అశోక్ కుమార్, గోగం సురేష్, కళ్లం వెంకటేశ్వరరెడ్డి, దొంతిరెడ్డి శ్రీరామిరెడ్డి, రాజులపాటి పార్వతి, జొన్నల రామోహన్‌రెడ్డి, శొంఠి వెంకటేశ్వరరావు, కాకర్ల వెంకటేశ్వరరావు, ఆరేపల్లి శ్రీనివాసరావు, అరుమళ్ల రమాదేవి, డి.బాలవెంకటేశ్వరరెడ్డి, రాజులపాటి రాఘవరావుతో పాటు పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమాణస్వీకారం

గుడివాడరూరల్: మార్కెట్ యార్డ్ నూతన పాలకవర్గ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. స్థానిక మార్కెట్‌యార్డ్‌లో చైర్మన్ చాత్రగడ్డ రవికుమార్, వైస్ చైర్మన్ గొరిపర్తి వెంకట నాగసుబ్బారావు, సభ్యులుగా ఆలమూరి మురళీకృష్ణ, చీకటి నాగలక్ష్మి, గంపా వెంకట్రావ్, గుల్లపల్లి రమాదేవి, కట్టా శ్రీనివాసరావు, కొండపల్లి రాఘవరెడ్డి, లింగం శివరావు, సూరపనేని ప్రదీప్, వెలగలేటి వెంకటేశ్వరమ్మ, యెడపల్లి నాంచారమ్మ, వి.విజయలక్ష్మి, వడ్డే క్రాంతికుమార్‌తో యార్డ్ సెక్రటరీ భాస్కరరావు ప్రమాణస్వీకారం చేయించారు. నూతన పాలకవర్గాన్ని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తదితరులు అభినందించారు. కూటమి నాయకులు రామినేని వెంకటకృష్ణ, పిన్నమనేని బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

పశువుల బలి నిషేధం

గుడివాడ టౌన్: రంజాన్‌ను పురస్కరించుకుని పశువులను బలి ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ జి. బాలసుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని ముస్లిం మైనార్టీ నాయకులు, వివిధ మసీదు కమిటీల సభ్యులతో సమావేశం నిర్వహించారు. బక్రీద్‌ను పురస్కరించుకుని మసీదుల వద్ద ఏ విధమైన పశుబలి చేయవద్దని సూచించారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించామని, ఎటువంటి గోవులు, ఒంటెలు, ఇతర జీవాల బలి చేయవద్దన్నారు. ఆదేశాలు ఉల్లంఘించిన వారిపై జంతు హింస నివారణ చట్టం 1960, గోవధ నిషేధం 1977 చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు, టూటౌన్ సీఐ నాగప్రసాద్ పాల్గొన్నారు.

రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



తోట్లవల్లూరు: సాగు ప్రోత్సాహంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జి. నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని దేవరపల్లిలో కృషి విజ్ఞాన కేంద్రం(ఘంటసాల) ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలను నాగేశ్వరరావు వివరించారు. కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ మంజువాణి ఉద్యాన పంటలైన కూరగాయలు, కంద, పసుపు, ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఆయిల్‌పామ్ పరిశోధనా స్థానం ప్రతినిధి డాక్టర్ కల్యాణ్‌బాబు, మండల ఉద్యాన అధికారి చందు పాల్గొన్నారు.

ఉపాధి కూలీకి పాముకాటు

తోట్లవల్లూరు: ఉపాధి కూలీ పాము కాటుకు గురై ఆస్పత్రి పాలైన ఘటన మండలంలోని చినపులిపాకలో జరిగింది. గ్రామానికి చెందిన ఆయుధం ఏడుకొండలు బుధవారం గ్రామంలో ఉపాధి పనులు నిర్వహిస్తుండగా పాము కాటుకి గురయ్యాడు. ఫీల్డ్ అసిస్టెంట్ సోమేశ్వరరావు వెంటనే ఏడుకొండలును ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రస్తుతం ఏడుకొండలు ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిసింది. చికిత్స పొందుతున్న ఏడుకొండలును సర్పంచ్ శివరామకృష్ణ పరామర్శించారు.

రక్తదాతలే ప్రాణదాతలు



గుడ్లవల్లేరు: ఆపదలో ఉన్న క్షతగాత్రులను రక్తం ఇచ్చి ఆదుకునే రక్తదాతలే ప్రాణదాతలని జిల్లా రెడ్‌క్రాస్ సెక్రటరీ భవిరి శంకరనాథ్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు మేరకు లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ, ఎంపీడీఓ టి.విజయసారథి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

డిగ్రీలో ఇంటర్న్‌షిప్ తొలగించాలి

గుడివాడ టౌన్: ఉన్నత విద్యామండలి ప్రవేశపెట్టిన డ్యూయల్ డిగ్రీ విధానంలో ఇంటర్న్‌షిప్ విద్యార్థులకు తీవ్రభారం అవుతుందని, ఆ విధానాన్ని తొలగించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్న్‌షిప్ గత రెండేళ్లగా రాష్ట్రంలో అమలవుతుందని విద్యార్థులు చదివే చదువుకు ఇంటర్న్‌షిప్‌కు సంబంధం లేకపోవడంతో వారికి అది భారంగా మారిందని పేర్కొన్నారు. ఇంటర్న్‌షిప్ మూడేళ్లు కాకుండా నిర్ణీత సమయాన్ని కేటాయించి నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

సంక్షిప్త వార్తలు

ఆటల పోటీలతో దేహదారుఢ్యం

గుడ్లవల్లేరు: వేసవి విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులకు నిర్వహించే ఆటల పోటీలతో దేహదారుఢ్యం ఏర్పడుతుందని అంగలూరు, గుడ్లవల్లేరు గ్రంథాలయాధికారులు పి.వి.వి.పద్మజ, వాణి అన్నారు. బుధవారం వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు నృత్య, ఆట పాటలతో పాటు పుస్తక పఠనం, చిత్ర లేఖనం పోటీలను నిర్వహించారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: స్థానిక రాజేంద్రనగర్ లోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు బుధవారం కూడా కొనసాగాయి. శిక్షణలో భాగంగా చిన్నారులకు డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. అనంతరం చెస్, క్యారమ్స్ ఆటలు ఆడించినట్లు గ్రంథాలయ అధికారి పి.శాంతి తెలిపారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

జమీగొల్వేపల్లి(పామర్రు): వేసవి శిబిరాల్లో భాగంగా మండలంలోని జమీగొల్వేపల్లి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు బుధవారం క్విజ్ పోటీలను నిర్వహించినట్లు ఉపాధ్యాయురాలు పి.పద్మావతి తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వి నాగ సురేష్, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. పామర్రులోని ద్వితీయ శ్రేణి గ్రంథాలయంలో విద్యార్థులకు బుధవారం నీతి కథలను బోధించినట్లు గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీ రాణి పేర్కొన్నారు. అనంతరం వేమన శతకకాలు చెప్పించామని తెలిపారు.

ఘనంగా ఎస్పీ బాలు జయంతి



ఎస్పీ బాలు చిత్రపటానికి నివాళులర్పించిన కళాపీఠం సభ్యులు

పామర్రు: ప్రముఖ సినీ గాయకులు ఎస్పీ బాలసుబ్రమణ్యం జయంతి వేడుకలను స్థానిక హితమ్ స్కూల్లో ఘంటసాల కళాపీఠం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాపీఠం అధ్యక్ష కార్యదర్శులు కాటూరి వెంకటమురళీ కృష్ణ, నందిపాటి హేమంత్‌రెడ్డి తదితరులు బాలసుబ్రమణ్యం చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ప్రముఖ నాట్య కళాకారిణి ఉల్లి రోహితశ్రీవల్లీని సత్కరించారు. కళాపీఠం సభ్యులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

పమిడిముక్కల: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. అంగనవాడీ, మండల పరిషత్ సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు. ఎంపీడీఓ సీతారామరాజు, ఏఓ రామకృష్ణ పోటీలను పర్యవేక్షించారు.

మేలైన వంగడాల ఎంపిక కీలకం

కైకలూరు: రైతులు మేలైన వంగడాలను ఎంపిక చేసుకుని అధిక దిగుబడులు పొందాలని ఏలూరు జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కె.ఫణికుమార్ సూచించారు. తామరకొల్లు గ్రామ రైతులకు వరి విత్తనాల ఎంపికపై సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విత్తనాల్లో ముంపును, చౌడును తట్టుకునే రకాలను రైతులు తెలుసుకోవాలన్నారు. ఎంటీయూ 1318, ఎంటీయూ 1140, ఎంసీఎం 103, ఎంసీఎం 100, ఎంసీఎం 125 వరి రకాల గురించి రైతులకు వివరించారు. ఏఓ ఆర్.దివ్య సీసీఆర్సీ కౌలు రైతు గుర్తింపు కార్డుల గురించి వివరించారు. అనంతరం ఎంటీయూ 1318 విత్తనాలు పంపిణీ చేశారు. సర్పంచ్ భట్రాజు శివాజీ, పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్, రైతులు పోతురాజు, శ్రీనివాస్, ఏసురాజు, వీఏఏ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెరువును అక్రమంగా తవ్వుతున్నారని ఫిర్యాదు

పమిడిముక్కల: తమ గ్రామంలో అక్రమంగా పంచాయతీ చెరువును తవ్వుతున్నారని వేల్పూరు గ్రామస్తులు బుధవారం తహసీల్దార్ నవీన్‌కుమార్, ఎంపీడీఓ సీతారామరాజుకు ఫిర్యాదు చేశారు. ఏ విధమైన అనుమతులు లేకుండా మట్టిని తవ్వి బయటకు తరలిస్తున్నారని, సర్పంచ్ దిలీప్ ఆధ్వర్యంలో తవ్వకాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దీనిపై ఎంపీడీఓ కార్యదర్శితో మాట్లాడారు. మట్టి తవ్వకాలను నిలుపుదల చేయాలని ఆదేశించారు.